## క్లుప్తంగా

### విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

డెంకాడ: విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా మండలంలోని పలు గ్రామాలకు ఈనెల 23వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ పి.అప్పలస్వామినాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగ్గాథపురం, చినవల్లూరు, పెదవల్లూరు, మోపాడ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

### వితరణ

డెంకాడ: మండలంలోని చొల్లంగిపేట పంచాయతీలోని రెల్లిపేటలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలకు మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ బుధవారం నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి

విజయనగరం ఫోర్ట్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సాయి ఆస్పత్రి వైద్యుడు అక్కెన శ్రీరామ్మూర్తి తెలిపారు. 40 ఏళ్లు దాటిన వారు గుండె సంబంధిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆస్పత్రి ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పేదవారికి వైద్య సహాయం అందించాలన్న సంకల్పంతో ప్రతి బుధవారం ఆస్పత్రిలో విశాఖపట్నం అపోలో ఆస్పత్రి కన్సల్టెంట్ వైద్యుడు శశాంక్ రోగులను ఉచితంగా తనిఖీ చేస్తారని చెప్పారు. గుండె సంబంధిత తనిఖీలు, ఈసీజీ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో డాక్టర్ శశాంక్, తదితరులు పాల్గొన్నారు.

### యాదవులకు మేలు చేసింది టీడీపీయే..

విజయనగరం గంటస్తంభం: రాష్ట్రంలో అనేక బీసీ కులాలు, సంఘాలకు తెలుగుదేశం పార్టీ హయాంలోనే మేలు జరిగిందని రాష్ట్ర బీసీ సాధికారక సమితి యాదవ సంఘ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు తెలిపారు. అశోక్ బంగ్లాలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యాదవులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత తమ పార్టీదేనన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో కార్పొరేషన్ మినహా తమకు జరిగిందేమీ లేదన్నారు. సమావేశంలో యాదవ కమిటీ పట్టణ అధ్యక్షుడు ప్రసాదుల వరప్రసాద్, అధికార ప్రతినిధి నూకాలమ్మ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

### ముగిసిన క్విజ్ పోటీలు

విజయనగరం అర్బన్: రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయిలో పాఠశాల విద్యార్థులకు 'ఆర్థిక అక్షరాస్యత' అంశంపై నిర్వహిస్తున్న క్విజ్ పోటీల్లో భాగంగా బుధవారం మండల స్థాయి పోటీలు ముగిశాయి. జిల్లాలోని 27 కేంద్రాల్లో ఈ పోటీలు నిర్వహించారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఇద్దరేసి వంతున బృందంగా ఏర్పడి పోటీలలో పాల్గొన్నారు. మండల స్థాయిలో ప్రకటించిన మొదటి, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల నగదు బహుమతులు అందజేశారు. ఈ నెల 28న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

### నెల్లిమర్లలో స్కిల్‌హబ్ కేంద్రం

నెల్లిమర్ల: నియోజకవర్గ కేంద్రంలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ కేంద్రంలో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సత్యనారాయణ, స్కిల్ హబ్ ప్రతినిధి టి. నీతూ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ అసోసియేట్ కోర్సులకు నిరుద్యోగులైన యువతకు శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు.

అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయసు లోపు ఉండాలని తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం వివిధ సంస్థల్లో ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 99663 36206 నంబర్‌ను సంప్రదించాలన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని స్కిల్ హబ్ నిర్వాహకులు పిలుపునిచ్చారు.

### తల్లిని కొట్టిన కేసులో తనయుడికి జైలు శిక్ష

సంతకవిటి: తల్లిని కొట్టి గాయపర్చిన కేసులో తనయుడికి జైలు శిక్ష విధించినట్టు ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు బుధవారం తెలిపారు. సంతకవిటి మండలం పానుగుటివలస గ్రామానికి చెందిన శాసపు కృష్ణ తనను గాయపర్చాడని తల్లి అప్పలనారాయణమ్మ ఈ ఏడాది జనవరి 10న సంతకవిటి పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపర్చగా జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ ముద్దాయికి ఐదు నెలల జైలు శిక్షతోపాటు రూ.100లు జరిమానా విధించారన్నారు. ఈ కేసును ఏపీపీ కిమిడి సూర్యకుమార్ వాదించారని తెలిపారు.

# ఈ నెలాఖరు వరకే గడువు..

- 30లోగా మొదటి అర్ధ సంవత్సరం పన్ను చెల్లించాలి
- జూలై 1 నుంచి చెల్లించే వారిపై 2 శాతం వడ్డీ భారం
- విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 64 వేలకు పైగా అసెస్మెంట్లు
- మొత్తం డిమాండ్‌లో ఇప్పటివరకు వసూలైంది రూ.8.28 కోట్లు మాత్రమే


నగరంలోని భవన సముదాయాలు

విజయనగరం: స్థానిక సంస్థల మనుగడలో పన్నుల రూపంలో వచ్చే ఆదాయం ఎంతో కీలకం. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా... ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నా.. వివిధ రూపాల్లో ఆదాయాన్ని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఓ వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పద్దుల కింద నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఖజానా నింపుకోవాల్సిందే. అలా ఆదాయాన్ని సమకూర్చుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని అధికారులు సైతం చెబుతున్నారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూళ్లపై దృష్టి సారించిన మున్సిపల్ శాఖ మొదటి అర్ధ సంవత్సరం పన్ను మొత్తాన్ని రాబట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో రెండు విడతల్లో భవన యజమానులు పన్ను చెల్లించాల్సి ఉండగా... మొదటి అర్ధ సంవత్సరం గడువు ఈనెల 30తో ముగియనుంది. అయితే ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పన్నులు వసూళ్లు కాకపోవటం గమనార్హం.

**64,734 అసెస్మెంట్లు..**

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం 64,734 అసెస్‌మెంట్లు ఉండగా... వాటి ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.22.48 కోట్ల ఆదాయం కేవలం ఆస్తి పన్ను రూపంలో వసూలు కావాల్సి ఉంది. ఇవి కాకుండా గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో మరో రూ. 21.01 కోట్లు వసూలు కాకుండా పెండింగ్‌లో ఉంది. ఇలా మొత్తంగా రూ.43.49 కోట్లు మొత్తం ఆస్తి పన్ను రూపంలో ఖజానాకు జమ కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రూ.8.28 కోట్లు (19.05 శాతం) మాత్రమే వసూలైనట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో మొత్తం పన్ను ఒకేసారి చెల్లించే వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ కల్పిస్తోంది. ఇంకా ఖజానాకు రూ.35.20 కోట్లు ఆస్తి పన్ను రూపంలో రావాల్సి ఉంది.

**ముగియనున్న గడువు**

2023 – 24 ఆర్థిక సంవత్సరంలో మొదటి అర్ధ సంవత్సరం పన్ను చెల్లించేందుకు గడువు దగ్గరపడుతోంది. జూన్ 30లోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పన్ను చెల్లించవచ్చని కార్పొరేషన్ యంత్రాంగం ప్రకటించింది. జూలై 1వ తేదీ నుంచి పన్ను చెల్లించే వారు 2 శాతం వడ్డీతో పన్ను మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. నిర్ణీత గడువు దగ్గరపడుతుండడంతో కార్పొరేషన్ యంత్రాంగం నగరంలోని భవన యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. సకాలంలో పన్నులు చెల్లించటం ద్వారా వడ్డీ భారం నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

**30 లోగా చెల్లించాలి..**



కార్పొరేషన్ పరిధిలో భవన యజమానులు మొదటి అర్ధ సంవత్సరానికి సంబంధించి పన్ను చెల్లించాలి. ఈనెల 30లోగా చెల్లించే వారికి ఎటువంటి అపరాధ రుసుం ఉండదు. అనంతరం పన్ను చెల్లించే వారిపై మొదటి అర్ధ సంవత్సరం డిమాండ్‌పై 2 శాతం వడ్డీ పడుతుంది. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలి.

– రెడ్డి శ్రీరాములనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

# అందుబాటులో ఉండాలి

- ట్రాన్స్‌కో డీఈ సురేష్‌బాబు


మాట్లాడుతున్న విజయనగరం రూరల్ డీఈ సురేష్‌బాబు

భోగాపురం: విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు విద్యుత్‌శాఖ సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ట్రాన్స్‌కో డీఈ జి.సురేష్‌బాబు సిబ్బందికి సూచించారు. రాజాం, చీపురుపల్లి, భోగాపురం, విజయనగరం సబ్ డివిజన్లకు సంబంధించి రూరల్ డీఈగా బాధ్యతలు చేపట్టిన సురేష్‌బాబు బుధవారం మండల కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవికాలంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయన్నారు. పాడైన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి అమర్చాలని సూచించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే విద్యుత్ మీటర్లను మంజూరు చేయాలన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ బిల్లులను ఫోన్ పే, గూగుల్ పే, మీసేవా, ఆన్‌లైన్ ద్వారా చెల్లించుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. టోల్ ఫ్రీ నంబర్ 1912కు తెలియజేసిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఎ.డి కుమార్, పూసపాటిరేగ ఏఈ నాగేశ్వరరావు, డెంకాడ, భోగాపురం ఇన్‌చార్జ్ ఏఈ పీవీ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

# నియామకపత్రం అందజేత


క్షేత్ర సహాయకురాలికి నియామకపత్రం అందిస్తున్న ఎంపీపీ సుధారాణి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తగా ఏర్పడిన గొర్లిపేట పంచాయతీకు ఉపాధి హామీ నూతన క్షేత్ర సహాయకురాలిగా గ్రామానికి చెందిన లెంక శ్రావణిని ఎంపికైంది. ఈ మేరకు ఎంపీపీ అంబళ్ల సుధారాణి బుధవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, నిష్పక్షపాతంగా పనిచేసి ఉపాధిహామీ పథకం లక్ష్యాలను నెరవేర్చాలన్నారు. వేతనదారులు, మేట్లతో సమన్వయంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, గ్రామపెద్ద పరిసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# పోటీతత్వం అలవర్చుకోవాలి

- ఎంఈఓ విజయ్‌కుమార్


విజేతలతో ఎంఈఓ, తదితరులు

నెల్లిమర్ల: విద్యార్థులంతా పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఎంఈఓ ఈపు విజయ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం మండలస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోటీతత్వం ఉంటేనే అన్ని రంగాల్లో రాణించవచ్చన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శాంత, తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే నెల నాలుగో తేదీ నుంచి 'జగనన్న సురక్ష'

డెంకాడ: వచ్చే నెల నాలుగో తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించి, తొమ్మిది అంశాల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ స్వరూపారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ పి. ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ఒక బృందం, తన ఆధ్వర్యంలో మరో బృందం పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 4వ తేదీన మోపాడ.. 5న చింతలవలస–1,2.. 6న బొడ్డవలస, చొల్లంగిపేట.. 11న డెంకాడ, అమకాం.. 12న బంటుపల్లి, గుణుపూరుపేట.. 13న గొలగాం, మోదవలస.. 18న జొన్నాడ, అక్కివరం.. 19న పినతాడివాడ, పెదతాడివాడ..20వ తేదీన రఘుమండ, సింగవరం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## విద్యార్థులకు పురస్కారాలు


విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న హెచ్‌ఎం విజయకుమారి

నెల్లిమర్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ఇటీవల పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఎల్. కౌశిక్, కె. వంశీ, యు. హర్షవర్ధన్‌లను బుధవారం సత్కరించారు. నగదు బహుమతి అందజేసి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి. విజయకుమారి, పీఎంసీ చైర్‌పర్సన్ రూప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవాలి

- ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ పైడిరాజు


పూసపాటిరేగ: విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న బ్యాంక్ ప్రతినిధులు

పూసపాటిరేగ: ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవాలని స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఆర్. పైడిరాజు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కుమిలి, తిప్పలవలస, పూసపాటిరేగ పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి విద్యార్థులకు ఆర్థిక అంశాలపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ నోడల్ అధికారి కె. సింహాచలం నాయుడు, బిజినెస్ కరస్పాండెంట్ ఎస్‌వీ గణపతిరావు, పాఠశాల హెచ్‌ఎం బి. శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.


డెంకాడ: ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో బ్యాంక్, విద్యాశాఖ అధికారులు

**విజేతలకు బహుమతులు..**

డెంకాడ: మండలంలోని పినతాడివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆర్‌బీఐ సౌజన్యంతో నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఏపీజీవీబీ డెంకాడ బ్రాంచ్ మేనేజర్ పి. కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో 10 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. డెంకాడ జెడ్పీ ఉన్నత పాఠశాల, అక్కివరం పంచాయతీ గొల్లపేట ఏపీ మోడల్‌స్కూల్, పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఎంఈఓ రాధాకృష్ణ, ఎస్‌బీఐ లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ ఎ.శ్రీనివాసరావు, ఏపీజీవీబీ ఆర్‌ఎం డి.రామకృష్ణ, నోడల్ అధికారి కిశోర్‌కుమార్, పెదతాడివాడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.రాజశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# క్షతగాత్రుడికి అండగా..


బాధితుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స (ఫైల్)

నెల్లిమర్ల రూరల్: ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు మానవత్వం చాటుకుంటున్నారు. నియోజకవర్గ పరిధిలో ఎక్కడ ఎవరికి ఏ ఆపద వచ్చినా తానున్నానంటూ ముందుకు వస్తున్నారు. ఇటీవల మొయిద గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, జూట్‌మిల్లు శ్రామిక సంఘ మాజీ కార్యదర్శి శీర వెంకటరావు ఇటీవల జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. తలకు గట్టి దెబ్బలు తగలడంతో కోమాలోకి వెళ్లిపోయారు. చికిత్స నిమిత్తం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు వెంటనే ఆస్పత్రికి చేరుకుని అన్నీ తానై చూసుకున్నారు. సకాలంలో బ్రెయిన్‌కు ఆపరేషన్ పూర్తి కావడంతో ప్రస్తుతం వెంకట్రావు ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించుకున్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పూణే ఆర్మీ ఆస్పత్రికి తరలించగా.. అందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ ఎమ్మెల్సీ పర్యవేక్షించి, కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఎస్సై నారాయణరావు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నారాయణరావు

నెల్లిమర్ల రూరల్: మాదకద్రవ్యాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్సై నారాయణరావు అన్నారు. మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కాలంలో యువత మాదకద్రవ్యాలను ఎక్కువగా వినియోగిస్తోందన్నారు. చెడు వ్యసనాల బారిన పడితే బంగారు భవిష్యత్ పాడవుతుందని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఒంటికి యోగా మంచిదేగా..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా సాధకులు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించి యోగా విశిష్టతను వివరించారు. కేంద్రియ గిరిజన విశ్వ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీసీ టీవీ కట్టిమణి మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే యోగా సాధన చేయాలన్నారు. జేఎన్‌టీయూ (జీవీ)వీసీ కె. వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ జి. స్వామినాయుడు.. సీతం ఇంజినీరింగ్ కళాశాలలో డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్, విజయనగరం


భోగాపురం: మండల పరిషత్ కార్యాలయంలో యోగా దినోత్సవం


విజయనగరం అర్బన్: యోగా ఆసనాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న గిరిజన యూనివర్సిటీ వీసీ కట్టిమణి


నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్‌లో యోగాసనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు


నెల్లిమర్ల: ఆదిత్య పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


విజయనగరం లీగల్: యోగా చేస్తున్న న్యాయమూర్తి కల్యాణ చక్రవర్తి, తదితరులు


విజయనగరం అర్బన్: సీతం ఇంజినీరింగ్ కళాశాలలో యోగా దినోత్సవం

# సులభతరంగా ధ్రువపత్రాల జారీ


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

- మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు మరింత సులభతరంగా ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసే బృహత్తర కార్యక్రమానికి ప్రతిఒక్కరూ సహకరించాలని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, జగనన్న సురక్ష పథకం ఆవశ్యకత, ప్రయోజనాలను వివరించారు. జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను పూర్తి ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. ఇందుకుగాను కార్పొరేషన్ ఆధ్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 24వ తేదీ నుంచి వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల వివరాలను సేకరిస్తారన్నారు. అనంతరం అధికారుల పర్యవేక్షణలో పత్రాలు అందజేస్తామని తెలిపారు. కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ, జనన, మరణాల, వివాహ ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్ విధానాలు, ఆధార్ కార్డుతో మొబైల్ నంబర్ నిక్షిప్తం, రైతు వ్యవసాయ ఆధారిత పంట హక్కు కార్డులు, తదితర పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.